ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
గురువారం 19 డిసెంబరు 2024

గజగజ

మర్పల్లిలో 8.6, కాస్లాబాద్‌లో 9.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మూడు రోజుల నుంచి చలి చంపేస్తుంది. ఉన్నట్టుండి ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోయాయి. బుధవారం వికారాబాద్ జిల్లా మర్పల్లిలో అత్యల్పంగా 8.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే రంగారెడ్డి జిల్లా చౌదరిగూడ మండలం కాస్లాబాద్‌లో 9.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, మేడ్చల్ జిల్లా ఉప్పల్ పరిధిలోని మౌలాలిలో 11.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


వాల్‌పోస్టర్‌ను విడుదల చేసిన డీసీపీ శ్రీనివాస్

» రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్

మొయినాబాద్ రూరల్, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని రాజేంద్రనగర్ డీసీపీ చిందమనేని శ్రీనివాస్ పేర్కొన్నారు. అజీజ్‌నగర్ చౌరస్తాలోని విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం సైబర్‌క్రైంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ మాట్లాడుతూ... సైబర్ మోసాలకు గురైన బాధితులు వెంటనే 1930 నంబరుకు కాల్ చేయాలని సూచించారు. డిజిటల్ అరెస్టుల భయంతో ప్రజలు తమ బ్యాంకు ఖాతా వివరాలను మోసగాళ్లతో పంచుకుంటున్నారని, అలాంటివేవి ఉండవనే విషయాన్ని గ్రహించాలని తెలిపారు. కొందరు విద్యార్థులనే టార్గెట్ చేస్తున్నారని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం సైబర్ నేరాలపై అప్రమత్తం చేసే వాల్ పోస్టర్, ప్రొటెక్ట్ వాలంటీర్ల టీషర్టులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏసీపీ కిషన్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రమేష్, మొయినాబాద్ ఎస్సై నర్సింహ్మ, సైబర్‌క్రైమ్ పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో మన నేతలు

రోడ్డు విస్తరణకు జాప్యం ఎందుకు?

» మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



చేవెళ్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారిని విస్తరించేందుకు ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తుందో సమాధానం చెప్పాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం అసెంబ్లీ సమావేశాల్లో ఆమె మాట్లాడారు. హైవే విస్తరణకు గత ప్రభుత్వం భూసేకరణ చేసిందన్నారు. ఈ రోడ్డుపై రోజుకో ప్రమాదం జరుగుతూ ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు. ఎన్జీటీలో కేసు వేశారు. అధికారులు సరైన రిపోర్టులు అందించి తొందరగా కేసును వికెట్ చేయించాలని కోరారు. ఈనెల 13వ తేదిన ఎన్జీటీలో కేసు ఉంది. కేసు వికెట్ అయ్యిందా నిజంగా రోడ్డు పనులు ప్రారంభం అయ్యాయా. పూర్తిస్థాయిలో క్లారిటీ కావాలన్నారు. కేసు వికెట్ అయితే ఎప్పుడు రోడ్డు పనులు మొదలు పెడుతారని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు.

ఎన్జీటీలో కేస్ స్టేవికెట్ చేయిస్తాం : మంత్రి కోమటిరెడ్డి

పోలీస్ అకాడమీ నుంచి మన్నెగూడ వరకు నాలుగు లేన్ల రోడ్డు పనులు జరుగుతున్నాయని ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అసెంబ్లీలో సమాధానం చెప్పారు. రోడ్డు విస్తరణకు రూ.800 కోట్లు కేటాయిస్తే.. ఇందులో రూ.130 కోట్లు భూ సేకరణ కోసం చెల్లించడం జరిగింది. ఎన్జీటీలో కేసు ఉంది. స్టేవికెట్ చేయిస్తాం. గత నెల 29వ తేది నుంచి రోడ్డు పనులు జరుగుతున్నాయని మంత్రి స్పష్టం చేశారు.

'పాలమూరు-రంగారెడ్డి' పథకాన్ని పట్టించుకోండి

» సర్పంచ్‌లు చేసిన పనులకు బిల్లులివ్వండి

» శాసన మండలిలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి



షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగానికి సాగునీరు అందించే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన శాసన మండలిలో మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 2015లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేసి, ఐదు రిజర్వాయర్లను నిర్మించి, ట్రయల్ రన్ కూడ చేశారని ప్రస్తావించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలోని 12లక్షల 30వేల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన సాగునీటి ప్రాజెక్ట్, కొడంగల్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో ఏడాదిలో ప్రాజెక్ట్ పనులు పూర్తవుతాయని అందరు ఆశించారని అన్నారు. కానీ అలా జరగలేదన్నారు. అలాగే ఫరూఖ్‌నగర్ మండలంలోని మొగిలిగిద్ద గ్రామాన్ని మండలంగా చేయాలని డిమాండ్ చేశారు. 2019 నుంచి 2023 వరకు పదవుల్లో ఉన్న సర్పంచ్‌లు గ్రామాభివృద్ధి కోసం చట్టపరంగా చేసిన పనుల బిల్లులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. 317 జీఓతో ఇబ్బంది పడుతున్న ఉపాధ్యాయుల సమస్యలను సైతం పరిష్కరించాలని నవీన్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

నిబంధనలకు 'నీళ్లు'!

పుట్టగొడుగుల్లా వెలుస్తున్న వాటర్ ప్లాంట్లు

పల్లెల నుంచి పట్టణాల వరకు మినరల్ వాటర్ వినియోగం పెరిగిపోయింది. ప్రజలు కొని తాగేనీరు అసలీనా.. నకిలీనా అని తెలుసుకోని పరిస్థితి నెలకొంది. దీనిని ఆసరాగా చేసుకొని మార్కెట్‌లో మినరల్ వాటర్ పేరిట అక్రమ దందాకు తెరలేపారు వ్యాపారులు. వీధికో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తూ.. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. నీటి ప్రమాణాలను పరీక్షించాల్సిన అధికారులు నిద్రావస్థలో జోగుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



మినరల్ వాటర్ పేరిట అక్రమ దందా

ప్రజల ప్రాణాలతో చెలగాటం

కనిపించని బీఐఎస్ ప్రమాణాలు

అధికారుల తనిఖీలు శూన్యం


అపరిశుభ్రంగా ఉన్న టిన్నుల్లో నీటిని సరఫరా చేస్తున్న వాటర్ ప్లాంట్ నిర్వాహకులు



రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో నీటి శుద్ధి పేరిట దోపిడీ జరుగుతోంది. విచ్చలవిడిగా వెలుస్తున్న వాటర్ ప్లాంట్లపై అధికారుల నిఘా కరువైంది. వాటర్ ప్లాంట్లలో నిర్వాహకులు తయారు చేసి సరఫరా చేసిన నీరు శుద్ధమైనదిగా భావించి ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. అయితే వాటర్ ప్లాంట్ల యాజమాన్యాలు బ్యూర్ ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) నిబంధనలు పాటించకుండానే మినరల్ వాటర్ పేరుతో మాయాజాలం చేస్తున్నారు. కొన్నిచోట్ల అపరిశుభ్రమైన నీరు వస్తోంది. ప్రజారోగ్యాన్ని దెబ్బతీసే నీటి వ్యాపారానికి కళ్లెం వేయాల్సిన స్థానిక సంస్థలు, ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు ఎక్కడా కనిపించడం లేదు. జిల్లాలో మినరల్

మిగతా 8వ పేజీలో...

సమన్వయ లోపం..

ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపమే మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వాహకులకు వరంగా మారింది. ఆహార పరిరక్షణ విభాగం, భూగర్భజల వనరులశాఖ, రెవెన్యూశాఖలు మినరల్ వాటర్ ప్లాంట్‌లను పర్యవేక్షించాల్సి ఉండగా, ఏ ఒక్క శాఖ దృష్టి సారించడం లేదు. తాగునీటి స్వచ్ఛత, ఇతర అంశాలపై జాగ్రత్తలు తీసుకోకుండా నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వాటిపై ప్రజలు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు.

పాతదుస్తులే జీవనాధారం

వాడిన వాటిని సంతల్లో అమ్ముతూ ఉపాధి
ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్న వ్యాపారులు



8

ఉద్యాన పంటలు సాగు చేయాలి

రైతులకు అవగాహన కల్పించిన కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన కళాశాల శాస్త్రవేత్తలు



6


రికార్డులను తనిఖీ చేస్తున్న ఏసీపీ

నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి

ఆమనగల్లు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల నివారణ, నేరాల నియంత్రణకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి కోరారు. పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ఆయన సూచించారు. ఆమనగల్లు పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని బుధవారం ఏసీపీ రంగస్వామి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. సీఐ ప్రమోద్ కుమార్, ఎస్ఐలతో సమావేశమై పెండింగ్ కేసులు, వాటి పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. చోరీలకు ఆస్కారం లేకుండి గట్టినిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. వాహన దారులు విధిగా హెల్మెంట్ ధరించేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు వి.వెంకటేష్, శ్రీకాంత్ ఉన్నారు.

దైవచింతనతో ముందుకు సాగాలి


వేంకటేశ్వర ఆలయంలో రాష్ట్ర ప్లానింగ్ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి

కందుకూరు,డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని లేమూరు గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో రాష్ట్ర ప్లానింగ్ కమిటీ చైర్మన్ జి.చిన్నారెడ్డి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ ఒక్కరు దైవచింతనతో ముందుకు సాగితే రాజకీయాలకతీతంగా గ్రామాలు, పట్టణాలు మరింత పురోగతి చెందుతాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్షన్ కార్పొరేట్ చైర్మన్ చల్లా నర్సింహ్మారెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్‌లు గూడూరు కొండారెడ్డి, డిల్లీ గణేష్ పాల్గొన్నారు.

ఉసురు తీసిన ఆన్‌లైన్ బెట్టింగ్

» అప్పులు తీర్చలేక యువకుడు ఆత్మహత్యాయత్నం

» చికిత్స పొందుతూ మృతి


శివలింగం (ఫైల్)

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 18 (ఆన్‌లైన్): ఆన్‌లైన్ బెట్టింగ్ ఓ యువకుడి ఉసురు తీసింది. బెట్టింగుల కోసం చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధి తులేకలాన్‌లో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. తులేకలాన్ గ్రామానికి చెందిన చెనమోని రంగమ్మ, లక్ష్మయ్యల కుమారుడు శివలింగం(28) ప్రైవేట్ ఉద్యోగి. ఇతను ఆన్‌లైన్ బెట్టింగులకు అలవాటుపడి అప్పులపాలయ్యాడు. అవి తీర్చలేక మనస్తాపానికి గురై ఈ నెల 15న రాత్రి మూత్ర విసర్జనకని బయటకు వెళ్లి ఒంటిపై డీజిల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. తీవ్రంగా గాయపడిన శివలింగంను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

సఫాయి కర్మచారీలకు ఉపాధి కల్పించాలి

సఫాయి కర్మచారీల జాతీయ కమిషన్ చైర్మన్ వెంకటేశం


సఫాయి కర్మచారీల సమస్యలను వింటున్న వెంకటేశం

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సఫాయి కర్మచారీలకు ఉపాధి కల్పనలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని సఫాయి కర్మచారీల జాతీయ కమిషన్ చైర్మన్ ఎం.వెంకటేశం అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులు, మున్సిపల్ కమిషనర్‌లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సఫాయి కర్మచారీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సఫాయి కర్మచారీల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను సక్రమంగా అమలుచేసి వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు అన్ని చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో మున్సిపల్ కార్పొరేషన్లలో, మున్సిపాలిటీల్లో పని చేస్తున్న సఫాయి కర్మచారీలకు వేతన స్లిప్, పీఎఫ్, ఈఎస్ఐ, బీమా అందిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్లు తెలిపారు. అపరిశుభ్రమైన ప్రాంతాలలో పనిచేయడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో వీరు నివసించే ప్రాంతాలలో సంవత్సరానికి రెండు సార్లు వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, పోలీస్ స్టేషన్లలో వీరిని నియమించి కనీస వేతనాలు అందించాలని ఆదేశించారు. మహిళా కార్మికులకు ప్రత్యేకమైన కమిటీని ఏర్పాటు చేసి సఫాయి కర్మచారీల సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. అలాగే ప్రధానమంత్రి బీమా యోజన స్కీమ్‌పై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రామరావు, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారి ప్రవీణ్‌రెడ్డి, జిల్లా మైనార్టీ అధికారి నవీన్‌రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమాధికారి రామేశ్వరి దేవి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆందోళన

» వంటావార్పుతో సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

» కలెక్టరేట్ ఎదుట రోడ్డుపైనే భోజనం


కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై భోజనాలు చేస్తూ నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన ఆందోళన 12వ రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా ఉద్యోగులంతా బుధవారం కలెక్టరేట్ ఎదుట వంటావార్పు నిర్వహించారు. రోడ్డుపై కూర్చుని భోజనం చేసి ప్రభుత్వానికి నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు జీవిత బీమా, ఆరోగ్య భద్రత కల్పించాలని, ప్రాణాలు కోల్పోయిన ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

పిల్లలు, గర్భిణులకు వ్యాక్సిన్ ఇవ్వాలి

» జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ షబా


రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ షబా

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పీపీ యూనిట్‌ను జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ షబా బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇమ్యునైజేషన్‌కు సంబంధించిన రికార్డులను, రిఫ్రిజిరేటర్‌లోని వ్యాక్సిన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వ్యాక్సిన్లకు కావాల్సిన టెంపరేచర్‌ను కొనసాగించాలన్నారు. పిల్లలు, గర్భిణులకు విధిగా వ్యాక్సిన్ ఇవ్వాలని ఆదేశించారు. వ్యాక్సినేషన్ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ వి.విజయలక్ష్మి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



బొంరాస్‌పేట్: వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు



పూడూరు: ప్రకాశ్‌ను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ

బొంరాస్‌పేట్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో బొంరాస్‌పేట్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. బుధవారం వికారాబాద్‌లో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో బొంరాస్‌పేట్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన అబ్బాస్, హారతి, రక్షిత, శైలజ ఉత్తమ ప్రదర్శన చేశారని సైన్స్ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ తెలిపారు.

జీవశాస్త్రం టాలెంట్ టెస్టులో...

దోమ: జీవశాస్త్రం టాలెంట్ టెస్టులో దోమలోని జడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. తెలుగు మీడియంలో శ్రీకాంత్, ఇంగ్లీష్ మీడియంలో హరీశ్, దాదాపూర్ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన వైష్ణవి బహుమతులు సాధించారు. కార్యక్రమంలో జీవశాస్త్రం ఫోరం అధ్యక్షుడు బుచ్చిలింగం, హెచ్ఎం జహంగీర్, టీచర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పరీక్షకు విద్యార్థి ఎంపిక

పూడూరు: జీవశాస్త్ర టాలెంట్ పరీక్షలో పూడూరు మండల విద్యార్థి రాష్ట్ర స్థాయి పరీక్షకు ఎంపికయ్యారు. కంకల్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.ప్రకాశ్ జీవశాస్త్రం టాలెంట్ టెస్ట్ ప్రతిభచూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

షాబాద్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ సర్పంచ్ బుయ్యని సంధ్యారాణి మల్లికార్జున్‌గౌడ్ అన్నారు. బుధవారం కుర్వగూడలో పట్నం మహేందర్‌రెడ్డి ఆసుపత్రి వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో పోటీపడాలి



మందులు అందజేస్తున్న డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్

కడ్తాల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): సమాజ సేవ, ప్రజా చైతన్య కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు పోటీ పడాలని డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్ అన్నారు. ముద్విన్‌లో బుధవారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్, జర్పుల రాదాకృష్ణ మెమోరియల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కడ్తాల మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, మాడ్గుల పీఏసీఎస్ చైర్మన్ తిరుమల్‌రెడ్డిలతో కలిసి వెంకటేశ్ శిబిరాన్ని ప్రారంభించారు. 330 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

చేవెళ్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఉద్యాన పంటలు సాగు చేసి దిగుబడులు సాధించాలని రాజేంద్రనగర్‌లోని కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన కళాశాల శాస్త్రవేత్తలు డాక్టర్ జి. జ్యోతి, డాక్టర్ ప్రవీణ్ సూచించారు. కొండాలక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో చేవెళ్ల మండల పరిధిలోని పలుగుట్ట గ్రామంలో రైతులకు ఉద్యాన సాగుపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పుట్టగొడుగులు, మిద్దె పంటలు, పెరటి తోటల పెంపకంపై తదితర రైతులు సాగు చేసేందుకు దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పూర్ణిమ మిశ్రా, పశువైద్యురాలు శిరీష, మాజీ సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, కళాశాల విద్యార్థులు పవన్, వెంకటేశ్, శ్రీకాంత్, శ్రీవన్‌రెడ్డి, శివసాయి, రాజు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి





మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీలత, సెమినార్‌లో పాల్గొన్న విద్యార్థులు

మేడ్చల్ టౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత అన్నారు. బుధవారం గుండ్లపోచంపల్లి పరిధి మైసమ్మగూడ సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్ఎస్ఎస్ క్లబ్ ఆధ్వర్యంలో సైబర్ నేరాల నివారణపై విద్యార్థులకు అవగాహన సెమినార్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు ఎక్కువవుతున్నాయన్నారు. సైబర్ నేరాల నివారణకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వ్యవస్థను రూపొందించినా నేరాలు తగ్గడం లేదన్నారు. సైబర్ నేరాలు జరగకుండా ఉండాలంటే మన అప్రమత్తతే ముఖ్యం అన్నారు. ఫోన్లు, ఆన్‌లైన్ సేవలను వినియోగించే సమయాల్లో జాగరూకతతతో వ్యవహరించాలన్నారు. పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు, ఇతర సమాచారాన్ని ఎవరికీ తెలపవద్దన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు సైబర్ నేరాలపై అనుభవాలను తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి టీవీ.రెడ్డి, పీఆర్వో రవిసుధాకర్, పోలీసు అధికారులు సుధీర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఆంజనేయులు బాధ్యతల స్వీకరణ



మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఆంజనేయులు

కులకచర్ల, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కులకచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బీఎస్.ఆంజేయులు బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు ఆయనకు బాధ్యతలు అప్పగించారు. మార్కెట్‌లో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. చైర్మన్‌గా అవకాశం కల్పించిన పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కులకచర్లలో పశువుల సంత ఏర్పాటుకు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్య, పాండురంగ ఆలయ చైర్మన్ మైపాల్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, డైరెక్టర్లు రాంచంద్రయ్య, భరత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అంజిలయ్యగౌడ్, నాయకులు భరత్‌కుమార్, గోపాల్‌నాయక్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరాముడి పాదుకల ఊరేగింపు




మేడ్చల్ టౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి అయోధ్యకు తీసుకువెళ్తున్న శ్రీరాముడి పాదుకలు బుధవారం మేడ్చల్ పట్టణం అత్వెల్లికి చేరుకున్నాయి. భక్తులు స్వామి వారి పాదుకలకు స్వాగతం పలికి ఊరేగింపు నిర్వహించారు. శివాలయంలో పెద్దఎత్తున పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రొయ్యపల్లి మల్లేష్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సత్యనారాయణ, ఈశ్వర్ తదితరులు ఉన్నారు.

ఇళ్ల సర్వేకు నెట్ ఇబ్బందులు

నెట్‌వర్క్, సర్వీస్ సమస్యతో ఆరు గ్రామాల్లో సర్వే ఆలస్యం

తాండూరు రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు ప్రభుత్వం గ్రామాల్లో సర్వే చేస్తోంది. ఈ నెల 31వ తేదీకల్లా ఇళ్ల లబ్ధిదారుల నివేదికను ఇవ్వాలని మండల పరిషత్ అధికారులు పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలిచ్చారు. సర్వేను మండల పరిధి 33 పంచాయతీలు, 8 అనుబంధ గ్రామాల్లో రెండు రోజుల క్రితం ప్రారంభించారు. బుధవారం అంతారంలో కార్యదర్శి సత్యనారాయణరెడ్డి సర్వే చేపట్టగా ఇంటర్నెట్ లేక అప్‌లోడ్ చేయలేకపోయారు. మండలంలో ఇప్పటి వరకు 108 కుటుంబాల సర్వేనే పూర్తయింది. అంతారం, ఓగీపూర్, చెంగోల్, గుండ్లమడుగుతండా, ఉద్దండాపూర్, సంకిరెడ్డిపల్లి, గోనూరు గ్రామాల్లో కార్యదర్శులు మొబైల్ యాప్ ద్వారా సర్వే ప్రారంభించగా ఇంటర్నెట్ సమస్య తలెత్తుతుంది. రోజూ ప్రతీ గ్రామంలో 30 కుటుంబాలను సర్వేచేసి యాప్‌లో నమోదు చేయాలని అధికారులు సెక్రటరీలను ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులను పంచాయతీ కార్యదర్శులే తేల్చాలని సూచించడంతో తమకు ఇది తలనొప్పిగా మారిందని వారు పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటే సరిహద్దు గ్రామాల్లో మొబైల్ నెట్‌వర్క్ ఉండక సర్వర్ డౌన్‌లోడ్‌కాక రోజుకు 8 నుంచి 10 కుటుంబాలనే సర్వే చేయగలుగుతున్నామని కార్యదర్శులు పేర్కొన్నారు. కొన్ని గ్రామాల్లో సర్వేకు ఇంటర్నెట్ సమస్య తలెత్తుతోందని కార్యదర్శులు వాపోతున్నారు.


అంతారంలో ఇందిరమ్మ ఇళ్లపై సర్వే నిర్వహిస్తున్న కార్యదర్శి సత్యనారాయణరెడ్డి

టీడీపీ పునర్‌వైభవానికి కార్యకర్తలు కృషిచేయాలి


టీడీపీ సభ్యత్వ నమోదు యాప్‌ను చూపుతున్న వెంకటేశ్, కార్యకర్తలు

కీసర రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవాన్ని తెచ్చేలా ప్రతీ కార్యకర్త కృషిచేయాలని మేడ్చల్ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు సుంకరి వెంకటేశ్ అన్నారు. బుధవారం నాగారం మున్సిపాలిటీలో పార్టీ సభ్యత్వ నమోదును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేద, బడుగు వర్గాల పార్టీ టీడీపీ అన్నారు. గతంలో పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తెచ్చిన సంస్కరణలు, చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ఇప్పటికీ ఎంతో మంది పార్టీ అభిమానులున్నారని తెలిపారు. వంద రూపాయలు చెల్లించి సభ్యత్వం పొందాలని, వారందరికీ ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. సహజ మరణం పొందిన కార్యకర్త కుటుంబానికి పార్టీ రూ.5లక్షలిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్ పార్టీ అధ్యక్షులు కొండా జంగారెడ్డి, కృష్ణారావు, బ్రహ్మయ్యచౌదరి, జంగాలచారి, చంద్రయ్య, దేవాచారి, మహేష్ పాల్గొన్నారు.

దరఖాస్తులు పెండింగ్ ఉండొద్దు


ధరణి దరఖాస్తులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్

కొడంగల్, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్‌ప్రసాద్ బుధవారం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యాలయంలో భూ సమస్యలపై దరఖాస్తులను, ధరణి రికార్డులను పరిశీలించారు. ఏ దరఖాస్తు అయినా పెండింగ్‌లో లేకుండా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు కావాల్సిన సర్టిఫికెట్లను వెంటవెంటనే జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు బెల్టు దుకాణాలు సీజ్


కడ్తాల్‌లోని కిరాణా దుకాణంలో తనిఖీ చేస్తున్న పోలీసులు

కడ్తాల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. సీఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో 4 ఎస్సైలు 47 మంది సిబ్బందితో కలిసి మండల కేంద్రంలో తనిఖీలు నిర్వహించారు. కిరాణా దుకాణాలు, ఫామ్‌హౌస్‌లు, పాన్‌షాపులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నాలుగు బెల్టు దుకాణాదారులపై కేసులు నమోదు చేశారు. శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై 52 వాహనాలను తనిఖీ చేశారు. బహిరంగప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న ఆరుగురిపై కేసులు నమోదు చేశారు. పాన్ షాపుల్లో, కిరాణాదుకాణాల్లో నిషేధిత గుట్కా విక్రయిస్తే చట్టపరంగా కేసు నమోదు చేస్తామని సీఐ తెలిపారు. రహదారిపై, పలు వార్డుల్లో పెద్దఎత్తున పోలీసులను మోహరించి తనిఖీలు చేపట్టారు.

తిరుమల చరిత్ర లోకానికి తెలియాలి


సౌందరరాజన్‌కు పుస్తకం అందజేస్తున్న ఎంవీఆర్ శాస్త్రి

మొయినాబాద్ రూరల్, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): టీటీడీ చెప్పని తిరుమల చరిత్ర లోకానికి తెలియాల్సిన అవసరం ఉందని చిలుకూరు బాలాజీ ఆలయం ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్ తెలిపారు. దేవుడున్నాడు జాగ్రత్త అనే పుస్తకాన్ని పుస్తక రచయిత ఎంవీఆర్ శాస్త్రి బుధవారం సాయంత్రం చిలుకూరు బాలాజీ దేవాలయంలో ఆలయ కమిటీ ఛైర్మన్ డాక్టర్ సౌందరరాజన్‌కు అందజేశారు. ఈ పుస్తకాన్ని మొదటగా తిరుమల తిరుపతి దేవస్థానంలో ఆవిష్కరించినట్లు వారు తెలిపారు. రంగరాజన్ మాట్లాడుతూ తిరుమల చరిత్రపై పుస్తకాన్ని రాయడం, తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన చిలుకూరులో మొదటి పుస్తకాన్ని అందజేయడం శుభ పరిణామమన్నారు. దేవాలయాలపై రచించిన పుస్తకాలను పఠిస్తే ఆధ్యాత్మికత పెంపొందుతుందన్నారు.

49వ రోజుకు చేరిన రిలే దీక్షలు

తలకొండపల్లి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటుచేయాలని జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం 49వ రోజుకు చేరాయి. దీక్షలకు సంఘీభావంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. దీక్షలో జేఏసీ నాయకులు, యువకులు, గ్రామ నేతలు కూర్చున్నారు. 9 గ్రామ పంచాయతీలను కలిపి గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని జేఏసీ ఛైర్మన్ అశోక్ గౌడ్, వైస్‌ఛైర్మన్ శరత్ చంద్రలు ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రం ఏర్పాటు విషయంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి చొరవ తీసుకోవాలన్నారు. జేఏసీ నాయకులు ఆంజనేయులుగౌడ్, బాస్కర్ నాయక్, రామునాయక్, శేషన్‌నాయక్, వెంకటయ్య, నరహరి, శ్రీను, రంజిత్, రమేశ్, శరత్, సత్తిరెడ్డి, చంద్రయ్య, రాములుగౌడ్, మల్లయ్య, అంజయ్య సురేశ్,రాములు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


మంత్రి శ్రీధర్‌బాబుకు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

చేవెళ్ల/షాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలతో పాటు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఐ నాయకులు మంత్రి శ్రీధర్ బాబును కోరారు. ఈమేరకు బుధవారం నగరంలో ఉన్న మంత్రి నివాసానికి వెళ్లి సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ఆధ్వర్యంలో నాయకులు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి, రవీంద్రచారి, పానుగంటి పర్వతాలు, రామకృష్ణ, చేవెళ్ల మండల ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, జిల్లా సమితి సభ్యులు చందు యాదవ్, సుధాకర్‌గౌడ్, మండల మహిళా నాయకురాలు లక్ష్మి, షాబాద్ మండల కార్యదర్శి రామకృష్ణ మంత్రిని కలిశారు.

ఆక్రమణదారులపై పీడీ యాక్ట్!

- హైడ్రా పోలీసు స్టేషన్ ఏర్పాటు తర్వాత చర్యలు
- అక్రమ నిర్మాణాల కూల్చివేతలకు 2024 జూలై కటాఫ్
- ఆ లోపు నిర్మించి, నివాసమున్న భవనాలపై చర్యలుండవు
- ఆ తర్వాత చేపట్టిన నిర్మాణాలేవైనా అక్రమమైతే కూల్చివేతే
- నివాసేతర నిర్మాణాలు ఎప్పటివైనా తొలగిస్తాం
- మూసీలో మట్టి పోస్తోన్న సంస్థలపై పోలీసులకు ఫిర్యాదు
- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణల విషయంలో పద్ధతి మార్చుకోని వారిపై అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరించారు. హైడ్రా పోలీసు స్టేషన్ ఏర్పాటు అనంతరం ఈ దిశగా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. హైడ్రా చర్యలపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో.. సంస్థ విధివిధానాలు, పరిధిని వివరిస్తూ బుధవారం ఆయన ఓ ప్రకటన చేశారు. 2024 జూలైలో హైడ్రా ఏర్పాటైందని.. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం దానినే కటాఫ్ తేదీగా పెట్టుకున్నామని తెలిపారు. హైడ్రా ఏర్పాటుకు ముందు అంటే జూలైకి మునుపు... చెరువుల ఎఫ్‌టీఎల్, పార్కులు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి అనుమతులతో నిర్మించి, ప్రజలు నివాసముంటున్న నిర్మాణాల జోలికి హైడ్రా వెళ్లదని స్పష్టం చేశారు. భవన నిర్మాణం ఎప్పుడు జరిగిందనేది గూగుల్ ఎర్త్, క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా గుర్తిస్తామని తెలిపారు. అనుమతులు లేకుండా నిర్మించిన వ్యాపార, వాణిజ్య వినియోగ భవనాలకు ఈ కటాఫ్ తేదీ వర్తించదన్నారు. గతంలో అనుమతులిచ్చి.. అనంతరం పర్మిషన్ రద్దు చేసిన పక్షంలో ఆ నిర్మాణాలు నివాసాలైనా.. వాటిని అక్రమ కట్టడాలుగా పరిగణించి చర్యలు తీసుకుంటామన్నారు. ఇక, హైడ్రా ఏర్పాటు తర్వాత ప్రజలకు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ అంశాలపై కొంత అవగాహన వచ్చిన నేపథ్యంలో జూలై తర్వాత చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని వివరించారు. అనుమతి ఉన్నా, లేకున్నా.. చెరువుల ఎఫ్‌టీఎల్‌లో భవనాలు నిర్మిస్తే చర్యలు తప్పవన్నారు. చెరువుల ఎఫ్‌టీఎల్‌లో ఉన్న నివాసేతర నిర్మాణాలు(ఎన్- కన్వెన్షన్ వంటివి) ఎప్పుడు నిర్మించినా చర్యలుంటాయని రంగనాథ్ వివరించారు. ఇక, చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలకు అనుమతులు జారీ చేస్తే అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని వెల్లడించారు.

ఆ సంస్థలపై ఫిర్యాదు..

నార్సింగ్, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో మూసీని ఆక్రమిస్తోన్న రాజ్‌పుష్ప, ఆదిత్య బిల్డర్స్ తదితర సంస్థలపై స్థానిక పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేశామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. మూసీలో పోసిన మట్టిని, ఇప్పటికే కట్టిన నిర్మాణాలను తొలగించాలని ఆయా సంస్థలను ఆదేశించామని చెప్పారు. మూసీలో అక్రమంగా జరుగుతున్న మట్టి డంపింగ్‌ను అడ్డుకునేందుకు హైడ్రా బృందాలు రాత్రి వేళల్లో గస్తీ కాస్తున్నాయని చెప్పారు. హైడ్రా ఆవిర్భవించిన తర్వాత చెరువుల ఎఫ్‌టీఎల్, పార్కులు, ప్రభుత్వ స్థలాల్లో ఎవరైనా తప్పుడు సమాచారంతో అనుమతులు తెచ్చుకున్నట్టు తేలితే.. ఆయా అనుమతులు రద్దుకు సంబంధిత శాఖలకు సిఫారసు చేస్తామన్నారు. ఆక్రమణలపై ప్రజల నుంచి వచ్చిన 5వేల ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించాయని చెప్పారు. ఆక్రమణదారులు ఎంతటివారైనా చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

శివారుల్లో అక్రమ నిర్మాణాలపై హైడ్రా చర్యలు

జీహెచ్‌ఎంసీ అవతల 20 మునిసిపాలిటీలు, ఏడు కార్పొరేషన్ల పరిధిలోని అక్రమ నిర్మాణాల కూల్చివేత అధికారాన్ని ప్రభుత్వం హైడ్రాకు ఇచ్చిందని కమిషనర్ రంగనాథ్ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనాలు, అక్రమ కట్టడాలపై దృష్టి సారించామని చెప్పారు. ఆయా నిర్మాణాల నియంత్రణకు చర్యలు తీసుకోని స్థానిక సంస్థల అధికారులపై చర్యలు తప్పవన్నారు. అక్రమ నిర్మాణమైనా.. ప్రజలు నివాసముండని వాటిపైనే చర్యలుంటాయని అన్నారు. వ్యక్తిగత ప్లాట్లలో(స్థలాల్లో)ని అక్రమ నిర్మాణాలనూ హైడ్రా కూల్చివేస్తుందని చెప్పారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై పట్టణ ప్రణాళికా విభాగం చర్యలు తీసుకుంటుందన్నారు. ఇక, గత ఐదు నెలల్లో హైడ్రా చేపట్టిన చర్యలతో సుమారు 200 ఎకరాల చెరువు, పార్కులు, ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకున్నామని తెలియజేశారు. 12 చెరువుల పునరుద్ధరణకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు వివరించారు.

ఆర్పీల సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మెప్మా రిసోర్స్ పర్సన్ల సమస్యలను పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అశోక్ హెచ్చరించాడు. బుధవారం మేడ్చల్ కలెక్టరేట్ వద్ద ధర్నాలో మాట్లాడుతూ.. హరితహారం, పట్టణ/పల్లె ప్రగతి, తడి/పొడి చెత్త సేకరణ, డబుల్ బెడ్ రూమ్ సర్వే, మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలిప్పించడం, శ్రీనిధి ఇలా అనేక రకాల సేవలందిస్తున్న ఆర్పీలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. జీతం నెలకు రూ.6వేలే ఇచ్చి చేతులు దులుపుకుంటోందన్నారు. వేతనం రూ.26వేలు, ఆర్పీలందరికి రూ.10లక్షల బీమా, డ్రెస్‌కోడ్, ఐడీ కార్డులు, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ధర్నా అనంతరం ఆర్పీల జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ఎస్.బాలమణి, కార్యదర్శి సీహెచ్.నంద, ఉపాధ్యక్షులు ఎమ్.లక్ష్మీ, వి.కవిత, సహాయ కార్యదర్శులు వినోద, పి.జ్యోతి, కోశాధికారిగా ఎస్.సునీత ఎన్నికయ్యారు.

వాహనాల తనిఖీ


వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ, ఎస్ఐలు

పరిగి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడిపితే చర్యలు తప్పవని పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ ఎం.సంతోష్ అన్నారు. బుధవారం పరిగి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నంబరు ప్లేట్లు లేని 35వాహనాలకు జరిమానాను విధించారు. ప్రతి వాహనానికి ఆర్సీ ఫిట్‌నెస్, బీమా తప్పకుండా ఉండాలని సూచించారు. నడిపే వారికి డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు బొంరాస్‌పేట్ జట్టు

బొంరాస్‌పేట్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): వికారాబాద్‌లో బుధవారం జరిగిన సీఎం కప్ ఫుట్‌బాల్ పోటీల్లో బొంరాస్‌పేట్ మండల క్రీడాకారులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచారు. మండలానికి చెందిన శ్రీశైలం, నర్సిములు, అశోక్, అఖిలేశ్, రాహుల్, ప్రభాకర్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 27 నుంచి జనవరి 2 వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. జిల్లాస్థాయి పోటీల్లో తాండూర్ మండల జట్టుతో బొంరాస్‌పేట్ జట్టు తలపడి గెలిచింది.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మేడ్చల్ టౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి):పేదల కోసం పలు ప్రైవేటు సంస్థలు నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ మున్సిపల్ 18వ వార్డు కౌన్సిలర్ భవానీరాఘవేందర్‌గౌడ్ అన్నారు. బుధవారం జీవీకే అంజు ఐ కేర్ సంస్థ నిర్వహించిన కంటి వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. పేదలకు వైద్య పరీక్షలు నిర్వహించి సేవలందిస్తున్న ప్రైవేట్ సంస్థల సేవలను ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని కోరారు. పరీక్షలు నిర్వహించిన అవసరమయ్యే శస్త్ర చికిత్సలకు జీవీకే అంజు ఐ కేర్ సంస్థ 20శాతం రాయితీ కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జీవీకే అంజు ఐ కేర్ డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కౌన్సిలర్ భవానీ

జీపీ వర్కర్లను అరెస్టు చేయడం విడ్డూరం


ఎంపీవోకు వినతి పత్రం ఇస్తున్న బాల్‌రాజ్

కందుకూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ వర్కర్లను అక్రమంగా అరెస్టు చేయడం విడ్డూరంగా ఉందని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు బుధవారం ఆ సంఘం నాయకులతో కలిసి ఎంపీవో గీతకు వినతిపత్రం ఇచ్చిన అనంతరం మాట్లాడారు. కాంగ్రెస్ అధిష్ఠానం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజలతో పాటు గ్రామ పంచాయతీ వర్కర్లకు ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చాక ఎందుకు నెరవేర్చడం లేదన్నారు. తమ సమస్యను పరిష్కారించాలని కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా చేపడితే పోలీసులు ఎందుకు అరెస్టు చేశారని ఆరోపించారు. గ్రామ పంచాయతీ వర్కర్ల సంఘం నాయకులు కె.బాల్‌రాజ్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి, హరికృష్ణ, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి


బీజేపీలో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

యాచారం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో సత్తా చాటి సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలను దక్కించుకునేందుకు కార్యకర్తలు చొరవ తీసుకోవాలని బీజేపీ జిల్లా నాయకుడు డేరంగుల రాజు అన్నారు. బుధవారం నల్లవెల్లి గ్రామానికి చెందిన 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు రాజు సమక్షంలో బీజేపీలో చేరారు. నాయకులు శేఖర్, వినోద్‌కుమార్ తదితరులున్నారు.

అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

కేశంపేట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ మహిళ ప్రసవం కోసం కేశంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. లో బీపీ ఉండటంతో 108 అంబులెన్స్‌లో షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రసవించింది. వివరాల్లోకి వెళితే.. కేశంపేట మండలం ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామానికి చెందిన కొండగాళ్ల శ్రీకాంత్ భార్య మౌనిక మంగళవారం రాత్రి ప్రసవం కోసం కేశంపేట పీహెచ్‌సీలో చేరింది. రాత్రి ఒంటి గంట సమయంలో మౌనికకు బీపీ తగ్గింది. పరిస్థితిని గమనించిన ఆసుపత్రి సిబ్బంది 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన ఈఎంటీ సాయికృష్ణ, పైలెట్ దీపక్‌లు హుటాహుటిన కేశంపేట ఆసుపత్రికి చేరుకున్నారు. మౌనికను అంబులెన్స్‌లో షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా రాత్రి 1.30 గంటల సమయంలో మార్గమధ్యలో వేములనర్వ వద్ద పురిటినొప్పులు అధికమయ్యాయి. ఈఎంటీ ఆమెకు ప్రసవం చేశారు. మౌనిక పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలను షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా 108 సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలిపారు.



కొత్త టీచర్లకు వేతనాలు ఇవ్వాలి



చేవెళ్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): 2024 డీఎస్సీ ఉపాధ్యాయులకు ప్రభుత్వం వెంటనే వేతనాలు చెల్లించాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో టీయూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ మునీర్ పాషా మాట్లాడుతూ ఇటీవల విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు జీతాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. చేవెళ్ల మండల శాఖ అధ్యక్షుడు దయానందం, శివానందం, శంకర్‌పల్లి మండల శాఖ అధ్యక్షుడు అంజయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రపంచస్థాయి క్రీడాకారులుగా ఎదగాలి


కృపశేఖర్, ఆదిత్యలను అభినందిస్తున్న పీఈటీ సత్తిరెడ్డి

శామీర్‌పేట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని పీఈటీ సత్తిరెడ్డి కోరారు. తూంకుంట ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి కృపశేఖర్, 8వ తరగతి విద్యార్థి ఆదిత్య జాతీయస్థాయి క్రీడాపోటీలకు ఎంపికవగా బుధవారం పీఈటీ వారిని అభినందించారు. ఇటీవల తాండూరులో జరిగిన ఎస్‌జీఎఫ్ ఖోఖో పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఆదిత్య, కృపశేఖర్ ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ ఇద్దరు ఉమ్మడి జిల్లా నుంచి ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయిలో ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలు ఈ నెల 21 నుంచి 24 వరకు ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో నిర్వహిస్తారు.ఈ విద్యార్థులను పాఠశాలలో ఎంఈఓ వసంత కుమారి, టీచర్లు, పీఈటీ అభినందించారు. జాతీయ స్థాయి క్రీడాపోటీల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు.

క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలి

పరిగి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని పరిగి మున్సిపల్ ఛైర్మన్ ఎం.అశోక్, ఎస్ఐ సంతోష్‌కుమార్ అన్నారు. క్రీడోత్సవాల సందర్భంగా ఆట, పోటీలను ఛైర్మన్ ప్రారంభించారు. విద్యార్థులకు బోధనతోపాటు కొంత సమయాన్ని క్రీడలకూ కేటాయించాలన్నారు. క్రీడల్లో రాణిస్తే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు, ఉన్నత చదువులకు రిజర్వేషన్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరిత, జ్యోతి తదితరులు పాల్గొనారు.


పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ అశోక్

ఎన్కెపల్లిలో ఒగ్గుడోలు శిక్షణ శిబిరం

యాలాల, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎన్కెపల్లిలో ఒగ్గుడోలు శిక్షణ శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ, మల్లికార్జున ఒగ్గుకళా సేవాసమితి, నాందార్‌పూర్ సంయుక్త ఆధ్వర్యంలో శిబిరాన్ని ప్రారంభించారు. గ్రామంలో ఈ శిబిరం ప్రారంభం కాగా, 21రోజులు కొనసాగనుంది. రోజూ పది గంటలపాటు శిక్షణ



ఇస్తారు. శిబిరంలో పాల్గొనేందుకు వంద మంది విద్యార్థులకు అవకాశం కల్పించింది. శిక్షకులు శివకుమార్, రాఘవేందర్, ఒగ్గు మల్లేష్ పాల్గొనున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, చంద్రారెడ్డి, శంకర్, ఆలయ ధర్మకర్త, పూజారి కిష్టప్ప, మాజీ జడ్పీటీసీ మంజులవెంకటేశం, జిల్లా ఒగ్గుబీర్ల సంఘం అధ్యక్షుడు, పూజారి శాంతప్ప పాల్గొన్నారు.


ఆర్డీవోను సన్మానిస్తున్న ఏబీవీ సభ్యులు

ఇండోర్ స్టేడియానికి స్థలం కేటాయించాలి

ఆమనగల్లు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలో ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు అనువైన స్థలాన్ని కేటాయించాలని కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డిని క్రీడాకారులు కోరారు. ఈమేరకు బుధవారం కందుకూరు ఆర్డీవో కార్యాలయంలో జగదీశ్వర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. బ్యాడ్మింటన్ కోర్టుకు స్థలం కేటాయించి క్రీడాకారులను ప్రోత్సహించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఆమనగల్లు బ్యాడ్మింటన్‌అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణానాయక్, ప్రధాన కార్యదర్శి కొట్ర మల్లేష్ ఉపాధ్యక్షుడు ఎంగళి ప్రసాద్, పవన్ కళ్యాణ్, తదితరులు ఉన్నారు.

పాత దుస్తులే జీవనాధారం

● వాడిన వాటిని అమ్ముతూ ఉపాధి పొందుతున్న చిరు వ్యాపారులు ● నగరం నుంచి తెచ్చి కొద్దిపాటి లాభంతో విక్రయం

యాచారం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పాత దుస్తులు అమ్మడమే వారికి తెలిసిన ఉపాధి. నాలుగు దుస్తులు విక్రయిస్తేనే ఆ చిరు వ్యాపారులకు పూట గడుస్తుంది. వాడిన వాటిని తీసుకొచ్చి ఎంతో కొంత లాభానికి అమ్ముతుంటారు. వివరాల్లోకి వెళితే.. నగరంలోని బేగం బజార్, రైన్‌బజార్, కోటి తదితర ప్రాంతాల్లో చిరు వ్యాపారులు పాత దుస్తులు.. ప్యాంట్లు, చీరలు ఇతరత్రా కొనుగోలు చేస్తారు. జత దుస్తులకు రూ.50కు కొని వారాంతపు సంతలలో రూ.75 నుంచి రూ.100వరకు విక్రయిస్తారు. చీరలు గంపగుత్తకు కొనుగోలు చేసి ఒక్కొక్కటి రూ.120 నుంచి రూ.165లకు విక్రయిస్తారు. మాల్, కందుకూరు, కడ్తాల్, ఇబ్రహీంపట్నం, తుక్కుగూడ తదితర ప్రాంతాలకు వెళ్లి దుస్తులు విక్రయిస్తుంటారు. చీరలను హోల్‌సేల్ వ్యాపారులు నగరంలో బేగంబజార్, కోటి ప్రాంతాల్లో తక్కువ ధరలకు విక్రయించడంతో చిరు వ్యాపారులు కొనుగోలు చేసి వారాంతపు సంతలలో విక్రయించి జీవనోపాధి పొందుతున్నారు. పాత దుస్తుల విక్రయంతోనే కొద్దిపాటి లాభాలు పొంది కుటుంబాలను పోషించుకుంటున్నారు. సంతలో పాత దుస్తులు అమ్ముడు పోకపోతే రవాణా ఖర్చుతో పాటు కిరాయి డబ్బు చేతినుంచి చెల్లించి ఇబ్బందుల పాలవుతున్నామని పలువురు చిరువ్యాపారులు తెలిపారు. తమకు బ్యాంకర్లు రుణాలు ఇవ్వడం లేదని వాపోతున్నారు. బంధువులు, తెలిసిన వారి వద్ద తక్కువ వడ్డీకి అప్పులు చేసి పాత దుస్తుల వ్యాపారం చేసుకుంటున్నామని చెబుతున్నారు. ప్రభుత్వం రుణాలు ఇప్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.


మాల్ సంతలో పాత దుస్తులను విక్రయానికి ఉంచిన చిరు వ్యాపారులు

దుస్తుల విక్రయంతోనే పూట గడుస్తది



పాత దుస్తుల విక్రయంతోనే ఉపాధి దొరుకుతోంది. దాంతో రోజూ పూట గడుస్తది. నగరంలో పాత దుస్తులు తక్కువ ధరకు కొనుగోలు చేసి వారాంతపు సంతలో అమ్మి కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. వ్యాపారం చేసేందుకు తెలిసిన వారివద్ద అప్పు తీసుకొస్తున్నాం. సర్కారు పెద్దలు బ్యాంకు నుంచి రుణాలందించి ఆదుకోవాలి.

- యాదమ్మ, చిరు వ్యాపారి, మాల్

క్రైం కార్నర్

బైక్‌ను ఢీకొన్న కారు

● ఇద్దరికి తీవ్ర గాయాలు ● పరారీలో డ్రైవర్..

కారులో పోలీస్ ఐడీ కార్డు లభ్యం.. పోలీసులకు అప్పగింత




గాయాలైన హన్మంత్‌రెడ్డి వద్ద కుటుంబీకులు, ప్రమాదానికి కారణమైన కారు



కారులో దొరికిన ఐడీ కార్డు

చేవెళ్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎదురుగా వస్తున్న బైక్‌ను కారు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో తంగడ్‌పల్లి గ్రామం రెవెన్యూ శివారులో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీస్‌లు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మండల పరిధి తంగడ్‌పల్లి అనుబంధ గ్రామం మడికట్టు గ్రామానికి చెందిన రామస్వామి, హన్మంత్‌రెడ్డి, పోచయ్యలు బైక్‌పై మండల పరిధిలోని ఎన్కెపల్లి చౌరస్తాలో జరిగిన వివాహానికి హాజరయ్యారు. తిరిగి సాయంత్రం గ్రామానికి బయలుదేరారు. ఈక్రమంలో తంగడ్‌పల్లి గ్రామం రెవెన్యూ శివారులో ఎదురుగా వస్తున్న కారు(టీఎస్ 07 ఎఫ్‌యూ 8199) బైక్‌ను ఢీకొంది. దాంతో రోడ్డు పక్కన ఉన్న గుంతలో బైక్‌తో పాటు ముగ్గురూ పడిపోయారు. హన్మంత్‌రెడ్డి, పోచయ్యలకు కాళ్లు విరిగి నుజ్జునుజ్జయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. కాగా, కారు నడిపిస్తున్న వ్యక్తి ఓ పోలీస్ అధికారి అని స్థానికులు తెలిపారు. అతడు మద్యం సేవించి ఉన్నాడని, ప్రమాదం జరిగిన వెంటనే కారు దిగి అక్కడి నుంచి పారిపోయాడని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదానికి కారణమైన పోలీస్ అధికారు పేరు డి.భాస్కర్‌రెడ్డి, తండ్రి సత్తిరెడ్డి, మక్తల్ పోలీస్ స్టేషన్, మహబూబ్‌నగర్ అని కారులో లభించిన ఐడీ కార్డులో ఉంది. ఈమేరకు స్థానికులు ఐడీ కార్డును పోలీస్‌లకు అప్పగించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఆటో.. ఇద్దరికి గాయాలు

యాచారం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను వెనకాల నుంచి ఆటో ఢీకొట్టడంతో యువకుడితో పాటు ఓ మహిళ తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం సాయంత్రం యాచారంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన సొల్లేటి నాగరాజు(33) తన అత్త ఐలమ్మను బైక్‌పై చౌదర్‌పల్లికి తీసుకొస్తుండగా వెనకాల నుంచి ఆటో ఢీకొట్టింది. దాంతో నాగరాజు కాళ్లు, చేతులకు తీవ్రగాయాలైనాయి. అత్త ఐలమ్మకు కూడా గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎ.నర్సింహారావు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు


వెంకటరమణ

యాచారం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక వెల్డింగ్ దుకాణం నుంచి ఓ యువకుడు పారిపోయిన ఉదంతం యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మాల్‌లో చోటుచేసుకుంది. మాల్ గ్రామానికి చెందిన కోపనాతి వెంకటరమణ మాల్‌లో వెల్డింగ్ దుకాణం నిర్వహిస్తున్నాడు. అయితే, ఎప్పటిలాగానే సోమవారం సాయంత్రం అతడు ఇంటికి రాలేదు. దాంతో రెండు రోజులపాటు కుటుంబీకులు తెలిసిన వారు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ తెలియలేదు. దాంతో బుధవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహారావు చెప్పారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

కొత్తూర్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మైసమ్మ కాలనీకి వెళ్లే దారిలో ఉన్న కంచెలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద బుధవారం విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం.. రంగాపూర్ గ్రామానికి చెందిన కొందరు రైతులు కొత్తూర్‌లో నివాసముంటూ పశువులతో జీవనం కొనసాగిస్తున్నారు. ఈక్రమంలో కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేసేందుకు వెళ్లిన ఎద్దు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే ప్రాణాలను వదిలింది. ఎద్దు మృతిని తెలుసుకున్న రైతు రాజు.. సంఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించాడు. మృతి చెందిన ఎద్దు విలువ రూ.లక్ష వరకు ఉంటుందని తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరాడు. కాగా, కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఓ వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర గాయాలకు గురైనాడని వారు పేర్కొన్నారు. విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరారు.

పట్టుబడిన మద్యం బాటిళ్లు ధ్వంసం

షాద్‌నగర్ రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన మద్యం బాటిళ్లను షాద్‌నగర్ పోలీసులు ఎక్సైజ్ అధికారుల సమక్షంలో ధ్వంసం చేశారు. గతంలో పోలీసులు బెల్ట్‌షాపులు, ఇతర చోట్ల తనిఖీలు నిర్వహించారు. ఈమేరకు 47 కేసుల్లో పట్టుబడిన సుమారు రూ.2.50 లక్షల మద్యం బాటిళ్లను బుధవారం షాద్‌నగర్‌లో ధ్వంసం చేసినట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు.

పేదల ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట


చెక్కులు అందజేస్తున్న శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి

ఆమనగల్లు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని డీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వసతులు కల్పించి రోగులకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన శంకరయ్యకు రూ.60 వేలు, ఓర్సు పద్మకు రూ.13వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం ఆకుతోటపల్లిలో శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. ప్రభుత్వ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. అర్హులైన నిరుపేదలందరికీ ప్రభుత్వం పక్కా ఇళ్లు మంజూరు చేసి వారి సొంతింటి కలను సాకారం చేస్తుందన్నారు. నాయకులు షఫీ, రాములు, సత్యం, బుచ్చయ్య, తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం : డీసీపీ


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీసీపీ రాజేశ్

నందిగామ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని శంషాబాద్ డీసీపీ రాజేశ్ అన్నారు. మండల పరిధిలోని సింబియాసిస్ ఇంటర్‌నేషనల్ యూనివర్సిటీ విద్యార్థులకు బుధవారం సైబర్ నేరాలు, సామాజిక మాధ్యమాలలో హరాస్మెంట్, ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ విద్యార్థులు చదువులపై దృష్టి పెట్టి లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. సెల్ ఫోన్‌లను దూరంగా ఉండాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు ఖాతాల వివరాలు, ఓటీపీలు అడిగితే ఇవ్వొద్దన్నారు. ఆర్థిక పరమైన సైబర్ నేరాలు జరిగిన వెంటనే హెల్ప్‌లైన్ నంబర్ 1930కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఏసీపీ శ్రీనివాస్, నందిగామ సీఐ ప్రసాద్, ఎస్ఐ గోపాలకృష్ణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం


అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాల మహానాడు నాయకులు

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం ఇబ్రహీంపట్నంలో మాలమహానాడు నాయకులు ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు అంబేడ్కర్‌ను కించపరిచేలా ఉన్నాయని మాలమహానాడు నియోజకవర్గ కో కన్వీనర్ భర్తాకి రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు నాయకలు ఈగల రాములు, బండి నర్సింగ్‌రావు, యాదగిరి, శ్రీహరి, కిష్టయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

చలో రాజ్‌భవన్‌కు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

మహేశ్వరం/కడ్తాల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన చలో రాజ్‌భవన్ కార్యక్రమానికి బుధవారం మహేశ్వరం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. కాగా, నియోజకవర్గంలో పార్టీ పనితీరు, ప్రభుత్వ పథకాల అమలు ఏ విధంగా ఉందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అడిగి తెలుసుకున్నారని చెప్పారు. కడ్తాల మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామ రాజేశ్, కల్వకుర్తి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబోద్దీన్, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీసెల్ జిల్లా చైర్మన్‌కు నాయకుల సన్మానం


పెంటయ్యను సన్మానిస్తున్న అశోక్

కడ్తాల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన పత్తి పెంటయ్యను బుధవారం కడ్తాల్ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు పోతుగంటి అశోక్ మర్యాదపూర్వకంగా కలిశారు. గాంధీభవన్‌లో పెంటయ్యను కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువలతో సత్కరించారు. అదేవిధంగా ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రీక్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. ఇ.మల్లేష్, పురుషోత్తమ్, శ్రీశైలం, శివ, లడ్డు తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

● షాద్‌నగర్ రూరల్ సీఐ నర్సయ్య

చౌదరిగూడ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవని షాద్‌నగర్ రూరల్ సీఐ నర్సయ్య అన్నారు. బుధవారం కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని లాల్‌పహడ్‌లో పోలీస్ సిబ్బందితో వాహనాలను తనిఖీ చేశారు. కొందుర్గు ఏఎస్ఐ చత్రియనా యక్, జిల్లేడ్ చౌదరిగూడ ఏఎస్ఐ సక్రియ నాయక్, సిబ్బంది శ్రీధర్‌రెడ్డి, పరమేశ్వర్, మల్లేష్, రాములు, శ్రవణ్‌కుమార్ ఉన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి : రత్నం


మహరాజ్ పేటలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రత్నం

శంకర్‌పల్లి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం తెలిపారు. బుధవారం శంకర్‌పల్లి మండల పరిధిలోని మీర్జాగూడ, ఇంద్రారెడ్డినగర్, పిల్లిగుండ్ల, దొంతన్‌పల్లి, జన్వాడ మహరాజ్ పేట తదితర గ్రామాల్లో బీజేపీ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీజేపీతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమన్నారు. గ్రామాల్లో బీజేపీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు మరింత శ్రమించాలన్నారు. మండలాధ్యక్షుడు రాములుగౌడ్, సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సంజీవరెడ్డి, బయన్న, రాజేందర్‌సింగ్, మాజీ ఎంపీపీ బీర్ల నర్సింహ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం కప్-2024లో మోడల్ స్కూల్ విద్యార్థుల హవా


మోడల్ స్కూల్ విద్యార్థులతో ఉపాధ్యాయులు

మహేశ్వరం, డిసెంబరు 18 (ఆంధ్ర జ్యోతి): సీఎం కప్ -2024 క్రీడాపోటీ ల్లో భాగంగా మంగళవా రం మహేశ్వరం మోడల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటినట్లు ప్రిన్సిపాల్ గోపి తెలిపారు. ఈమేరకు విద్యార్థులను బుధవారం పాఠశాల ఆవరణలో సన్మానించారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీల్లో విద్యార్థులు మొదటి బహుమతి పొందినట్లు చెప్పారు. అధ్యాపక బృందం పాల్గొన్నారు.

'చూచిరాత' విద్యార్థులకు బహుమతుల ప్రదానం

మాడ్గుల : జ్ఞానవాహిని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆమనగల్లు పట్టణంలో ఇటీవల నిర్వహించిన చూచిరాత పోటీల్లో భాగంగా ప్రతిభ చూపిన వారికి బుధవారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో బహుమతులు అందజేశారు. పోటీల్లో నాలుగు ఉన్నత పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. హెచ్ఎం సుదర్శన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు 'నీళ్లు'!

(5వ పేజీ తరువాయి)

వాటర్ ప్లాంట్స్ పుట్టగొడుగుల్లా వెలుస్తున్నా అధికారుల కంటికి కానరావడం లేదంటే వారి పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక రాబోయే వేసవి కాలంలో తాగు నీటి వినియోగం అధికంగా ఉంటుంది.. ఇప్పటి నుంచే అధికారులు తనిఖీలు ముమ్మరం చేసి ప్రజారోగ్యానికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పాటించని నిబంధనలు..

నిబంధనల ప్రకారం వాటర్ ప్లాంట్‌లలో ఎయిర్ కండిషనర్‌తో పాటు కెమికల్ ల్యాబ్ మైక్రో బయోలజీ ల్యాబ్, ఫిల్లింగ్ గది, బీఐఎస్ నిబంధనలకు అనుగుణంగా ప్లాంట్ అంతా స్టెయిన్‌లెస్ స్టీల్‌తో ఉండాలి. ఇవే కాకుండా అధికారులు ప్రతీ మూడు నెలలకోసారి ఆయా ప్లాంట్లలో నీటి నమూనాలను సేకరించి పలు రకాల పరీక్షలు నిర్వహించాలి. సంతృప్తికరంగా ఉంటేనే లైసెన్స్ ఇవ్వాల్సి ఉంటుంది. ప్లాంట్ నిర్వహణతో పాటు ప్యాకెట్లు, బాటిళ్లకు కూడా ప్రత్యేక అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఇవేవి అధికారులు పట్టించుకోవడం లేదు.

తనిఖీలేవి?

బోరు నీటిని ట్యాంకులోకి పంపి క్లోరినేషన్ చేయాలి. కొంత సమయం తర్వాత శాండ్ ఫిల్టర్‌లో శుభ్రం చేయాలి. మినరల్స్‌ను జతచేసి ఓజోనైజేషన్ జరపాలి. అల్ట్రా వయోలెట్ రేడియేషన్ ద్వారా శుద్ధి చేసిన నమూనాలు తీయాలి. వాటిని మైక్రోబయోలజీ, కెమిస్ట్ ప్రయోగశాలలో పరీక్షించాలి. ఆ తర్వాత క్యాన్‌లలోకి, బాటిళ్లలోకి తీసుకోవాలి. ప్రమాణాలు పాటించని ప్లాంట్లపై ప్రివెన్షన్ ఆఫ్ ఫుడ్ అడల్ట్రేషన్ యాక్ట్ 1954 ప్రకారం కేసులు నమోదు చేయాలి. మూడు నెలలకోసారి ప్లాంట్లను తనిఖీ చేసి గుర్తింపు లేని వాటిని రద్దు చేసేలా జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్, మున్సిపల్, గ్రామ పంచాయతీ అధికారులు ఎక్కడా ఈ ప్రమాణాలను పరిశీలించిన దాఖలాలు లేవు.

తియ్యగా నీరుంటే చాలు..

రంగు లేని నీరు కాస్త తియ్యగా ఉంటేచాలనే ఉద్దేశంతో శుద్ధనీరు తయారీ కేంద్రాన్ని నడిపించేస్తున్నారు. నిబంధనల మేరకు నీటిని శుభ్రం చేయకుండానే అమ్మకాలు చేస్తున్నారు. బాటిల్ నీటిని కొన్న రెండు రోజుల్లోనే అందులో చిన్నచిన్న క్రిములు తయారవుతున్నాయి. ఈ నీటిని తాగడం ద్వారా అనేక వ్యాధులు వచ్చే అవకాశాలున్నాయని వైద్యులు చెబుతున్నారు. కలరా, టైఫాయిడ్, జాండిస్, చర్మ వ్యాధులతో పాటు ఇతర వ్యాధులు వచ్చే అవకాశం ఉందంటున్నారు.

కుటుంబ ఖర్చులో నీటికి..

ఆరు నుంచి ఎనిమిది మంది సభ్యులున్న కుటుంబంలో రోజుకు సగటున 20 లీటర్ల వాటర్ బాటిల్‌ను వినియోగిస్తున్నారు. 20 లీటర్ల బాటిల్ రూ.20కి విక్రయిస్తున్నారు. డోర్ డెలివరీ చేస్తే అదనంగా మరో 10 రూపాయలు తీసుకుంటున్నారు. ఇలా ఒక కుటుంబానికి రోజుకు సగటున 30 రూపాయల చొప్పున నెలకు రూ.900 ఖర్చువుతుంది.

మిషన్ భగీరథ నీటిని వినియోగించండి



అన్ని రకాల పరీక్షల తర్వాత పంపిణీ చేస్తున్న మిషన్ భగీరథ నీటిని తాగండి. స్థానికంగా వెలిసిన మినరల్ వాటర్ ప్లాంట్‌లో శుద్ధి చేస్తున్న నీటిని అధికారులు పరీక్షించారా లేదో తెలుసుకోండి. అధికారులు సర్టిఫైడ్ చేసిన మినరల్ వాటర్ ప్లాంట్స్ నీటిని తాగొచ్చు. తాగునీటి వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే.. అనారోగ్యానికి గురికావాల్సి ఉంటుంది. తాగునీటి వినియోగంలో జాగ్రత్త వహించండి. అనుమతి లేకుండా బోరు వేస్తే చర్యలు తప్పవు.

- మాధవరావు, జిల్లా జలవనరులశాఖ అధికారి

తనిఖీలు నిర్వహించాలి



నీటి శుద్ధి పేరుతో వ్యాపారం సాగిస్తున్న వాటర్ ప్లాంట్లను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలి. ఇప్పటి వరకు ఒక్కసారైనా తనిఖీ చేసిన పాపాన పోలేదు. మినరల్ వాటర్ బాటిల్స్ నీటితో రెండు రోజులు ఉంచితే నాచు, పురుగులు ఏర్పడుతున్నాయి. గ్రామాల్లో ఇష్టానుసారంగా ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వాటర్ ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలి. సురక్షితమైన నీటిని అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- కుమ్మరి భానుప్రసాద్, హిమాయత్‌నగర్, మొయినాబాద్ మండలం

సంక్షిప్తంగా..

● **ఆమనగల్లు :** అధైర్య పడొద్దు అండగా ఉంటానని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నారాయణపూర్ గ్రామానికి చెందిన బాణావత్ కేస్లీ అనారోగ్యంతో మృతిచెందింది. మృతురాలు కుటుంబాన్ని బుధవారం గోలి శ్రీనివాస్ రెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ. 5 వేలు అందజేశారు. నాయకులు తారాసింగ్,శ్రీను, హన్మంత్, లక్ష్మీపతి తదితరులు ఉన్నారు.

● **శంషాబాద్ రూరల్ :** రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని శంషాబాద్ మండలం నర్కుడ గ్రామంలో అమ్మపల్లి దేవస్థానంలో 41 రోజుల పాటు నియమ, నిష్ఠలతో మాలధారణతో దీక్ష చేపట్టిన అయ్యప్పస్వాములు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుస్వామి శేఖర్ ఆధ్వర్యంలో స్వాములు ఇరుముడులు ధరించి శబరికి బయలుదేరి వెళ్లారు. డీసీసీబీ డైరెక్టర్, పీఏసీఎస్ చైర్మన్ బుర్కుంట సతీశ్, మాజీ ఉప సర్పంచ్ గడ్డం శేఖర్‌యాదవ్, గురుస్వాములు సంజీవ్, అశోక్, నగేశ్, మహేశ్‌యాదవ్, మహేశ్, ప్రవీణ్, జంగయ్య, సురేశ్‌బాబు, కృష్ణ ముదిరాజ్, ప్రణయ్, రాజేశ్‌యాదవ్, శ్రీశైలం ముదిరాజ్ తదితరులున్నారు.

● **ఆమనగల్లు :** రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డిని బుధవారం కాంగ్రెస్ జిల్లా నాయకుడు అప్పం శ్రీను, రేవంత్ మిత్ర మండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసిఫ్ అలీ, రైతుసంఘం నాయకుడు రూపం వెంకట్‌రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. కొండారెడ్డిపల్లిలోని ఆయన నివాసంలో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. రైతు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ పరంగా కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల శ్రేయస్సుకు అమలు చేస్తున్న పథకాలను వారికి వివరించి సద్వినియోగం చేసుకునేలా చూడాలని కేవీఎన్ రెడ్డి కోరినట్లు అప్పం శ్రీను, ఆసిఫ్ అలీ తెలిపారు.

● **ఆమనగల్లు :** యువత ఉద్యోగ, ఉపాధి కల్పనకు ప్రభుత్వాలు పెద్ద పీట వేయాలని ఆమనగల్లు మాజీ జడ్పీటీసీ అనురాధపత్యనాయక్ కోరారు. మంగళపల్లి చెన్నకేశవ కాలనీలో రాములు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వయం ఉపాధి పథకాన్ని బుధవారం అనురాధపత్యనాయక్ ప్రారంభించారు. నాయకులు మురళి, రమేశ్ నాయక్, వెంకటేశ్, నరేందర్, కళ్యాణ్, గణేశ్‌నాయక్, తదితరులున్నారు.

● **కడ్తాల్ :** లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ బుధవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కడ్తాల మండలంలో పర్యటించాలని , జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముద్విన్‌లో నిరుపేద కుటుంబానికి నిర్మించిన నూతన ఇంటిని ప్రారంభించేందుకు రావాలని కేటీఆర్‌ను కోరగా సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.

కడ్తాల్ : సేవలను బట్టే సమాజంలో కీర్తి లభిస్తుందని మాజీ సర్పంచ్ తిరునగరి వేణుగోపాల్, లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు కండె సత్యనారాయణలు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ జి.చెన్నకిషన్‌రెడ్డి సహకారంతో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు.

ఘనంగా స్వయం పరిపాలన

చౌదరిగూడ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు శ్రద్ధగా విని ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని హెచ్ఎం ఉదయ్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. బుధవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని ఇంద్రనగర్ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించడం చాలా సంతోషంగా ఉందని, వారు తమ తమ భావాలు తెలియజేశారు. కలెక్టర్‌గా రహీన్, డీఈవోగా హాలియా, ఎంఈవోగా అభిషేక్, హెచ్ఎంగా విష్ణేష్‌లు వ్యవహరించారు. టీచర్లు నర్సింహులు, ప్రకాష్, స్వర్ణలత, వాకుళాదేవి,మాన్య, శ్యామల, సంజు, రాజయ్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.


స్వయంపరిపాలన దినోత్సవంలో విద్యార్థినీవిద్యార్థులు, ఉపాధ్యాయులు

సీపీఆర్‌పై అవగాహన శిబిరం అభినందనీయం

● మాజీ ఐఏఎస్ జయప్రకాశ్ నారాయణ


శిబిరాన్ని ప్రారంభిస్తున్న జేపీ, పక్కన డాక్టర్ హనుమంతరెడ్డి, మైథిలీరెడ్డి

శంషాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గుండెపోటు మరణాలు నివారించడానికి హృదయాలయ ఫౌండేషన్ ఉచితంగా సీపీఆర్‌పై శిక్షణ శిబిరం నిర్వహించడం అభినందనీయమని మాజీ ఐఏఎస్ జయప్రకాష్ నారాయణ అన్నారు. హృదయాలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ హనుమంతరెడ్డి సారథ్యంలో శిబిరం నిర్వహించి వేలాది మంది కళాశాలలు, పాఠశాలల విద్యార్థులతో పాటు వారి కుటుంబ సభ్యులకు పెద్దఎత్తున ఏర్పాటు చేసిన సీపీఆర్‌పై శిక్షణ ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. శిక్షణ పొందిన ప్రతీఒక్కరు ఎవరికైనా గుండెనొప్పి వస్తుందని అనుమానం కలిగితే వెంటనే సీపీఆర్ చేసి హుటాహుటిన దగ్గరలోని ఆసుపత్రికి తరలించాలని సూచించారు. డాక్టర్ హనుమంతరెడ్డి మాట్లాడుతూ ఈ ప్రోగ్రాం దేశంలోనే అతిపెద్దదని, తాను పుట్టిన శంషాబాద్ మండలం శంకరాపురంతో పాటు మండలం, మున్సిపాలిటీలోని అన్ని గ్రామాల వారికి ఉచితంగా సీపీఆర్ నేర్పించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. కనీసం లక్షమందికి ఉచితంగా సీపీఆర్‌పై శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు హనుమంతరెడ్డి చెప్పారు. అనంతరం డాక్టర్ మైథిలీరెడ్డి హార్ట్ ఎటాక్ వచ్చినప్పుడు సీపీఆర్ ఎలా చేయాలో శిక్షణ ఇచ్చారు. ఉదయం, సాయంత్రం సెషన్లలో పెద్దఎత్తున ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల నుంచి తరలివచ్చిన విద్యార్థులు గ్రామాల నుంచి వచ్చిన వారికి సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డి, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలకు చెందినవారు పాల్గొన్నారు.

దైవ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలి

కడ్తాల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దైవ కార్యక్రమాల్లో ప్రతీఒక్కరు పాలు పంచుకోవాలని బీజేపీ జిల్లా నాయకుడు రాందాస్ నాయక్ కోరారు. గడ్డమీది తండాలో అయ్యప్ప స్వామి సన్నిదానం నిర్మాణానికి రాందాస్ నాయక్ రూ.25వేల విరాళం సమకూర్చారు. బుధవారం అయ్యప్ప స్వాములకు అందజేశారు. స్వాములు పాండు, కిషన్, శ్రీను, తదితరులున్నారు.